క్లుప్తంగా

మునిప్రదీప్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్నముని ప్రదీప్

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని బొక్కశం పాలెం గ్రామానికి చెందిన నాగలాపురం వెంకట సుబ్బయ్య, రమాదేవి దంపతుల కుమారుడు మునిప్రదీప్ ఐఐటీ వారణాసి యూనివర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ పొందారు. ఐఐటీ యూనివర్సిటీ డైరెక్టర్ అమిత్ పత్రా చేతుల మీదుగా ఈ పట్టాను అందుకున్నారు.

మంత్రికి ఘన స్వాగతం



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి స్వాగతం పలుకుతున్న జేసీ శుభం బన్సల్

రేణిగుంట: తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు ఘన స్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎస్పీ సుబ్బ రాయుడు, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, శాప్ చైర్మన్ రవి నాయుడు తదితరులు పుష్పగుచ్ఛాలను అందించి ఘన స్వాగతం పలికారు. ఆర్డీవోలు భాను ప్రకాష్ రెడ్డి, రాంమోహన్, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్ తదితరులు మంత్రికి సాదర స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఆయన తిరుపతి ఫార్చ్యూన్ రిడ్జ్ హోటల్‌కు బయల్దేరివెళ్లారు. మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూది అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు, తిరుపతికి చెందిన రసూల్(32), జశ్వంత్(28) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా సీతారాంపేట వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనల మేరకే బాణసంచా విక్రయాలు



బాణసంచా దుకాణదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: నిబంధనల మేరకే దుకాణదారులు బాణసంచా విక్రయించాలని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం బాణసంచా దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దుకాణదారులు నిర్దేశించిన ప్రదేశంలోనే విక్రయాలు సాగించుకోవాలన్నారు. మంటలను అదుపు చేసే పరికరాలు, నీరు వంటివి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జనాభా సాల్లో బాణసంచా నిల్వలు చేసినా విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక, రెవెన్యూ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

దివ్యమైన భవిత

‘విధివంచితులై పుట్టుకతోనే మానసిక, శారీరక వైకల్యంతో తల్లి గర్భం నుంచి పుడమిపైకి వచ్చిన పిల్లలు వారంతా.. శిక్షణ స్థాయి మంద బుద్ధి కలిగిన ఆ పిల్లల ప్రవర్తనతో కన్నవారే విసిగిపోయి ఏం పాపం చేశాము దేవుడా...? అని మదనపడుతున్న రోజులెన్నో... అలాంటి పిల్లల ప్రవర్తన, శారీరక వైకల్యాలలో మార్పును తీసుకొచ్చి... వారిని సమాజానికి దగ్గర చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాలను ప్రతి మండలానికి ఒకటి ఏర్పాటు చేసింది. అక్కడ మండల పరిధిలోని దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక శిక్షణనిస్తూ, వారిలోని సానుకూల పరివర్తనను తీసుకొస్తోంది. రేణిగుంటలోని భవిత కేంద్రానికి అరబిందో సంస్థ సహకారం అందించి తొలి డిజిటలైజేషన్ భవిత కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అడుగులు వేసింది.



రేణిగుంట భవిత కేంద్రంలో వీడియో ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయులు

- రేణిగుంటలో భవిత కేంద్రానికి డిజిటల్ సొబగులు
- మాటలు రాని పిల్లలకు స్పీచ్ థెరపీ
- దివ్యాంగ పిల్లలకు కొండంత స్వాంతన
- భవిత సేవలపై హర్షిస్తున్న తల్లిదండ్రులు

రేణిగుంట: జిల్లాలో 32 భవిత కేంద్రాలు విద్యాశాఖ సర్వశిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఈ కేంద్రాల్లో జిల్లా వ్యాప్తంగా 952 మంది దివ్యాంగ పిల్లలు ప్రత్యేక శిక్షణ అందుకుంటున్నారు. రేణిగుంటలోని భవిత కేంద్రంలో 20 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ కేంద్రానికి న్యూఢిల్లీకి చెందిన అరబిందో సంస్థ డిజిటల్ భవిత కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చొరవ తీసుకుని అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తోంది. ఈ కేంద్రంలో సర్వశిక్ష తరఫున ఇద్దరు ఐఈఆర్‌టీలు, ఒక ఫిజియో థెరపిస్ట్, ఒక సైకాలజిస్ట్, ఒక కేర్ గివర్ ఇక్కడ పని చేస్తున్నారు. వీరితోపాటు అరబిందో సంస్థ తరఫున ఒక స్పెషల్ ఎడ్యుకేటర్, ఒక సైకాలజిస్ట్, ఒక ఫిజియో థెరపిస్ట్ పని చేస్తున్నారు.

వీడియో పాఠాలు– ఆహ్లాదకర ఆటలు

ఈ కేంద్రంలో అభ్యసించే మానసిక, శారీరక ఎదుగుదల లేని పిల్లలకు చదువులో ఆసక్తి కలిగేలా వీడియో పాఠాలను నేర్పుతున్నారు. ఈ కేంద్రంలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అరబిందో సంస్థ సేవలను అందిస్తోంది. వీరు రూ.1.5 లక్షలు విలువైన బోధనాభ్యసన సామగ్రిని అందజేశారు. వాటిలో రెండు కంప్యూటర్లు, పజిల్స్, ఫ్లాష్ కార్డులు, డిజిటల్ బోర్డులు, ఐహ్యాండ్ కో–ఆర్డినేషన్ మెటీరియల్, మ్యాగ్నటిక్ స్టిక్స్, బ్లాక్స్, వుడెన్ పిక్చర్ బోర్డులను అందజేశారు. తద్వారా ఆసక్తిని కలిగించే రీతిలో వీరి అభ్యసనం సాగుతోంది.

పిల్లల్లో సానుకూల ప్రవర్తన

ఇక్కడ చేరిన కొత్తలో పిల్లలు ఎక్కువగా కొట్లాడుకోవటం, గట్టిగా కేకలు వేయడం, ఇతర వింత ప్రవర్తనతో ఉండేవారు. అయితే ప్రత్యేక శిక్షణ ద్వారా వారి ప్రవర్తనలో మార్పును తీసుకొచ్చి స్వయం సహాయక నైపుణ్యాలు కలిగేలా చర్యలు తీసుకుంటున్నారు. స్పీచ్ థెరపీ ద్వారా అక్షరాలు, పదాలు నేర్పించడం, శబ్దాలను పలికించడం, పజిల్ బాక్సులను ఉపయోగించి ఆసక్తి కలిగించే విధంగా పిల్లలకు ప్రత్యేక బోధనను అందిస్తున్నారు. శారీరక వైకల్యం కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ ద్వారా వైకల్య స్థాయిని తగ్గించడంతోపాటు మున్ముందు వారి కండరాలు మరింత బిగుతుగా కాకుండా సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. వారంలో బుధ, శనివారాల్లో మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఫిజియోథెరపీ అందిస్తున్నారు. శనివారం పిల్లల ఇంటి వద్దకే వెళ్లి శిక్షణనిస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు

భవిత కేంద్రంలో అభ్యసిస్తున్న పిల్లలకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కింద రూ.3 వేలు, ఎస్కార్ట్ అలవెన్స్ రూ.2,500, 6నుంచి 8వ తరగతి ఇతర పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ బాలికలకు రూ.2వేలు స్టైఫండ్‌ను ప్రభుత్వం అందిస్తోంది. పిల్లలకు అవసరమైన హియరింగ్ ఎయిడ్స్, వీల్ చైర్స్, క్యాలిబర్స్, రొలేటర్స్‌ను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది.



ట్యాబ్‌ల ద్వారా ఐఈపీ బోధన

ఐఈపీ(ఇండివిడ్యువలైజ్డ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం)ను అరబిందో సంస్థ ప్రత్యేకంగా రూపొందించి ట్యాబ్‌ల ద్వారా పిల్లలకు బోధిస్తోంది. ఈ ప్రక్రియలో తల్లిదండ్రులను కూడా భాగస్వామ్యం చేస్తూ ఇంటి వద్ద వారు పిల్లలకు నేర్పించాల్సిన విషయాలు, అనుసరించాల్సిన విధానాలను కూడా ఇందులో మిళితం చేశారు. మొదటి, మూడవ శనివారాల్లో జిల్లా స్థాయి ఓపీ నిర్వహించి ఉచిత అసెస్‌మెంట్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాల్లో చేరిన విద్యార్థుల విభిన్న ప్రవర్తనను ఎంతో ఓర్పుతో భరిస్తూ, నేర్పుతో వారి పనులు వారు చేసుకునేలా ప్రత్యేక తర్ఫీదునిస్తున్న ఇక్కడి సిబ్బంది అంకిత భావాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశంసిస్తున్నారు. తమ పిల్లల్లో ఎంతో మార్పు వచ్చి మనసుకు ఎంతో ఊరట కలుగుతోందంటున్నారు.

మా అబ్బాయిలో ఎంతో మార్పు



మా పిల్లవాడు ఢిల్లీ ప్రతాప్‌కు మాటలు రావు.. మానసిక వైకల్యంతో తన పని కూడా తాను చేసుకునే పరిస్థితి లేదు. తోటి పిల్లలను బాగా కొట్టేవాడు.. కొరికేవాడని తరచూ అందరినీ ఇబ్బందిపెట్టేవాడని భవిత కేంద్రానికి పంపించాం. ఇక్కడ స్పీచ్ థెరపీ ద్వారా మాటలు కొంచెం, కొంచెంగా మాట్లాడుతున్నాడు. భోజనం బాగా తింటున్నాడు. తన వ్యక్తిగత పనులు కూడా తానే స్వయంగా చేసుకునే స్థాయికి రావడం చాలా సంతోషంగా ఉంది.

– మునిరాజనాయుడు, రేణిగుంట

పిల్లల్లో ఎంతో మార్పు

భవిత కేంద్రం దివ్యాంగ పిల్లలకు ఓ వరంగా ప్రభుత్వం గొప్ప కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇక్కడ పిల్లలకు మానసిక, శారీరక వైకల్యంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించి, వారి పనులు వారు స్వతహాగా చేసుకుని, ప్రతికూల ప్రవర్తనను మార్చుకునే దిశగా తర్ఫీదునిస్తున్నాం. ఢిల్లీకి చెందిన అరబిందో సంస్థ చొరవతో రేణిగుంట కేంద్రాన్ని డిజిటల్ భవిత కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. తల్లిదండ్రులు కూడా ఎంతగానో సహకరిస్తున్నారు.

– జేష్మ, ఐఈఆర్‌టీ, రేణిగుంట



సాధారణ స్థితికి తీసుకొచ్చి బోర్డుపై పాఠాలు నేర్పుతున్న సిబ్బంది



పిల్లలకు ఆటవిడుపుతో అభ్యసనం నేర్పిస్తున్న టీచర్



దివ్యాంగ చిన్నారికి ఫిజియో థెరపీ సాధన చేయిస్తున్న ఉపాధ్యాయులు

దళితులకు సాగు పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కుక్కంబాకం గ్రామలోని దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సోమవారం తహసీల్దార్ సుబ్రమణ్యంకు సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు దాసరి జనార్ధన్, దళితులు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, మండలంలోని కుక్కంబాకం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 81లోని 80.80 ఎకరాల ప్రభుత్వ భూమిని 20 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఫెయిల్ అడంగల్‌లో త.క. భూములుగా ఉన్నాయన్నారు. దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని పలుమార్లు రెవెన్యూ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని, పట్టాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నివేదించారు. ఇకనైనా స్పందించి పట్టాలు ఇవ్వాలని, లేనిపక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నలుగూరి రమణయ్య, బాలగురవయ్య, రమణయ్య, నాయకులు పాల్గొన్నారు.

స్కిమ్స్‌లో తరగతుల ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మిద్దెల హరి, ముఖ్య అతిథులు

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ (స్కిమ్స్) కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరం ఎంబీఏ, ఎంసీఏ తరగతులు ప్రారంభమైనట్లు కళాశాల కరస్పాండెంట్ మిద్దెల హరి తెలిపారు. తరగతుల ప్రారంభం సందర్భంగా ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విశ్రాంత ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ రఘురాం రెడ్డి, సాఫ్ట్ స్కిల్స్, మోటివేషనల్ ట్రైనర్ బి శ్రీరామ్ బాబు, హిందుస్థాన్ కోకా కోలా బేవరేజెస్ హెచ్‌ఆర్ టి.ఎల్ మౌనిక పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వారు మాట్లాడుతూ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రాముఖ్యత స్కిమ్స్ కళాశాల యొక్క మిషన్, విజన్, కోడ్ ఆఫ్ కాండక్ట్‌లను, కళాశాల అందిస్తున్న భౌతిక సౌకర్యాలైన కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, ప్లేస్‌మెంట్ సెల్, ప్లే గ్రౌండ్, కోర్స్ కరికులంను విద్యార్థులకు వివరించారు. అనంతరం నూతనంగా ప్రవేశించిన విద్యార్థులు క్యాంపస్‌లోని అన్ని విభాగాలను సందర్శించి అవగాహన పొందారు. ప్రిన్సిపల్ జీ గీతాదేవి, డైరెక్టర్ ఎ కుమార్, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


పిల్లల విద్యాభివృద్ధిని గుర్తించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వెంకటసుబ్బమ్మ

ఏర్పేడు: తమ పిల్లల విద్యాభివృద్ధిని తల్లిదండ్రులు ప్రతి రోజూ గమనిస్తూ ఉండాలని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటసుబ్బమ్మ అన్నారు. మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం,అధ్యాపకుల బోధనోత్సాహానికి తోడైతే ప్రతి విద్యార్థి సమగ్రాభివృద్ధి చెందుతారని సూచించారు. ప్రస్తుతం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాల నడుస్తుందని, తల్లిదండ్రులు సహకరించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీమన్నారాయణ, ఉమా, రామాంజులు, వెంకటసురేష్, రాఘవరెడ్డి, సువర్ణ, శంకరప్ప, అమరేశ్వర్‌రెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమష్టి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ దివాకర్‌రెడ్డి

నారాయణవనం: పార్టీలకతీతంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో మండలంలో అభివృద్ధి సాధించాలని ఎంపీపీ దివాకర్‌రెడ్డి కోరారు. సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఎంపీపీతోపాటు జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వ పథకాల ఫలాలను అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి అందేలా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని అన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశం అనంతరం ఎంపీటీసీ సభ్యులను సన్మానించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దార్ జయరామయ్య, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించరూ!



ఎంపీడీఓకు విన్నవిస్తున్న బీజేపీ నాయకులు

వరదయ్యపాళెం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండల బీజేపీ నాయకులు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసాద్‌ను కోరారు. మండలంలో ఉన్న 65 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి 55 కేంద్రాల్లో పలు మౌలిక వసతుల సమస్యలు నెలకొని ఉన్నాయని చెప్పారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు కేబీ గురుదేవ్, మండల పార్టీ అధ్యక్షులు పురుషోత్తం, నాయకులు అజేయ్ కుమార్, మురళి, శ్రీధర్, కన్నన్ తదితరులు ఉన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీ గురుమూర్తి, నూకతోటి రాజేష్

నాగలాపురం: మండలంలోని బైటకొడియంబేడుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత సుధా కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ నాయకులతో కలిసి ఆదివారం సుధా స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. త్వరలో సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అపరంజిరాజు, ఎంపీపీ శ్యామ్, సోషల్ మీడియా ఇంచార్జ్, వైస్ ఎంపీపీ దానివేలు, మాజీ ఎంపీటీసీ మోహన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

జీఎస్టీ రద్దు చేయాలని ఆందోళన

శ్రీకాళహస్తి: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని భారత జీవిత బీమా సంస్థ పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని ఎల్‌ఐసీ ఏజెంట్లు డిమాండ్ చేశారు. సోమవారం వారు కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘం నెల్లూరు డివిజన్ జనరల్ సెక్రటరీ సతీష్‌బాబు మాట్లాడుతూ వినియోగదారుల పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని కోరారు. జీవిత బీమా పాలసీలపై పాలసీదారులకు ఇచ్చే బోనస్‌ను పెంచాలని కోరారు. ఏజెంట్లకు ఇచ్చే కమీషన్లు పాతపద్ధతిలోనే కొనసాగించాలన్నారు. జీవిత బీమా సంస్థకు అధిక ఆదాయం చేకూర్చే ఏజెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, బాబురావు, ఈశ్వర్, శ్రీమన్నారాయణతోపాటు ఎల్‌ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.



కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

పోలీసుల రక్తదాన శిబిరానికి స్పందన

శ్రీకాళహస్తి: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని పోలీసులు రక్తదానం చేశారు. డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురు పోలీసులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చిన పోలీసులను అభినందించారు. సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు ఎస్‌ఐ విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ఎంజీఎం ఆస్పత్రిలో రక్తదానం చేశారు. రక్తదానం చేసిన నరేష్, సురేష్, నమోరంగ, వరముని, అరుణ్, హరి, బాలకృష్ణను తిమ్మయ్య అభినందించారు.





శ్రీకాళహస్తి ఎంజీఎం ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న పోలీసులు